క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



పాత గుంటూరు: స్థానిక సుద్దపల్లి డొంకలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి దేవస్థానంలో మాజీ ధర్మకర్త, పాదిల పూర్ణచంద్రరావు వర్ధంతి సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని పూర్ణచంద్రరావు విగ్రహానికి దేవస్థాన కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాలాపేట సీఐ ఎంపీ సుబ్బారావు పాల్గొని, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తలారి రాము, ఉపాధ్యక్షుడు కె. పున్నారావు, కార్యదర్శి డి. కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి. కృష్ణ, కోశాధికారి సీహెచ్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దివీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలకు 21 మంది ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్, అప్రెంటిస్ పోస్టులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుంచి 50 మంది విద్యార్థులు హాజరవ్వగా, తుది విడత ఎంపిక తరువాత ప్రతిభ చూపిన 21 మందిని ఎంపిక చేశారు. వీరికి త్వరలో నియామక పత్రాలు అందజేయనున్నట్లు దివీస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్‌డీ ఎగ్జిక్యూటివ్ ప్రతినిధులు కె. హరికృష్ణ, కె. శివవీస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతన రూపంలో రూ.2.4 లక్షల నుంచి రూ.2.8 లక్షల వరకు చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరాకాలనీలో నివాసం ఉండే దోబ కృష్ణ అలియాస్ చిన్నబాబు (50) గతంలో మిర్చి వ్యాపారం చేసేవాడు. అనారోగ్యం కారణంగా వ్యాపారం మానేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన కృష్ణ ఆదివారం చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

వ్యభిచారానికి పాల్పడుతున్న మహిళలతో పాటు, నిర్వాహకురాలు, విటుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజీవ్‌గాంధీ నగర్ పదో లైనులో ఓ ఇంటిలో లక్ష్మి అనే మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, విటుడ్ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. వెయ్యి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌత్రా సెంటర్‌లోని స్వీట్ షాపులో పనిచేసే నాగభూషణం (65) ఈనెల 5న బాత్‌రూములో ప్రమాద వశాత్తు కాలు జారి పడ్డాడు. బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసిన యువకుడిపై కేసు నమోదు

మైనర్‌ను గర్భవతిని చేసిన యువకుడిపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన 16 సంవత్సరాల బాలికపై సమీప బంధువు మీరావత్ భీముడు మాయమాటలు చెప్పి 2022 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ ప్రణాళిక విభాగంలో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీబీఓ, టీపీఎస్‌లు, టీపీఓలకు అంతర్గత బదిలీలు చేస్తూ నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీపీబీఓ రసూల్‌కు(1 నుంచి 7 వార్డులు, 52 వార్డు), టీపీఎస్ బాబు సువర్ణకుమార్(16 నుంచి 22, 25), టీపీఎస్ ఎ. లక్ష్మణస్వామి(24,26 నుంచి31), టీపీఎస్ బి. హృదయరాజు(39 నుంచి 48), టీపీఎస్ షేక్ రిజ్వాన(22, 32 నుంచి 38), టీపీఎస్ జె. గోవర్ధన్(8 నుంచి 15), టీపీఓ బి. నాగవల్లి(49,50,51,53 నుంచి 57 వరకు), డీసీపీ- 1 ప్రదీప్ కుమార్‌కు(18 నుంచి 25, 28 నుంచి 47,49,52), డీసీపీ- 2 కోటయ్యకు(1 నుంచి 17, 26, 27,48,50, 51,53 నుంచి 57 వరకు) వార్డులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైల్వేలో ఉద్యోగం పేరుతో రూ.లక్షలు నొక్కేశాడు..

‘ఏడాది క్రితం పరిచయమైన వ్యక్తికి అరండల్‌పేట 8/2లో కన్సల్టెన్సీ ఉంది. నా భార్యకు రైల్వేలో డేటా ఎంట్రీ ఉద్యోగం ఉందని నమ్మించాడు. రూ.5 లక్షలు చెల్లించాలని కోరాడు. జనరల్ షిఫ్ట్ కింద చేయాల్సి వస్తుందని, నెలకు రూ.20 వేలు జీతమని చెప్పాడు. దీంతో రూ.1,70,000 ఫోన్ పే చేశా. వారంలో ఉద్యోగంలో చేరాలని చెప్పి, రైల్వేలో ఓ ఉద్యోగిని పరిచయం చేశాడు. డేటా ఎంట్రీలో చేరిన రోజే పైస్థాయి ఉద్యోగి మూడు షిఫ్టులు చేయాలని, రూ.13 వేలు జీతమని వివరించాడు. శిక్షణ కాలంలో జీతాలు ఉండవని, పని తెలిశాక వేతనం ఇస్తారని చెప్పారు. ఈలోగానే మిగతా రూ.3.30 లక్షల్ని కన్సల్టెన్సీ నిర్వాహకుడు తీసుకున్నారు. రైల్వే ఉద్యోగి, కన్సల్టెన్సీ నిర్వాహకుడు డబ్బులు పంచుకుని మోసం చేశారు. న్యాయం చేయాలంటూ నగరాలుకు చెందిన డ్రైవర్ కె.గోపి స్పందనలో అర్జీ అందించారు.


బాధితుల సమస్యలు అలకిస్తున్న జిల్లా ఏఎస్పీ శ్రీనివాసరావు


అంబులెన్స్‌లో ఉన్న అబ్దుల్ రజాక్ బాధను అలకిస్తున్న డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాసరావు

- ఎస్పీ స్పందనలో బాధితుడి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ఏఎస్పీ ఎ. శ్రీనివాసరావు

నగరంపాలెం: స్పందనలో వచ్చిన అర్జీల్ని ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు ఆదేశించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ (క్రైం) ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారుల బాధను అలకించారు. ఫిర్యాదిదారుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్‌ఫోన్‌లో, జూమ్ ద్వారా ఏఎస్పీ మాట్లాడారు. చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు బాలసుందర్ (ట్రాఫిక్), శ్రీనివాసరావు(డీసీఆర్‌బీ), సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మరో పెళ్లి చేసుకుని మోసం

‘ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా చేస్తాను. 2007లో పెళ్లయింది. ముగ్గురబ్బాయిలు, ఒక అమ్మాయి. భార్యను ఉన్నత చదువులు చదివించా. నాలుగు పీజీలు చేసింది. కుటుంబ, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 2019లో సౌదీకి వెళ్లాను. ఆ సమయంలో భార్య, పిల్లలను ఆమె పుట్టింటి వద్ద విడిచివెళ్లాను. నెలనెలా భార్యకు డబ్బులు పంపించేవాడ్ని. అక్కడ పనిచేసే క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాను. అనంతరం 2021లో స్వదేశానికి వచ్చా. వైఎస్సార్(కడప) జిల్లా బద్వేలులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వేరొకరిని పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం ఆమె పట్టించుకోవడం లేదు. పిల్లలు నా వద్దనే ఉంటున్నారు. భార్య రెండో పెళ్లిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాను. ఆమెపై చీటింగ్ కేసు నమోదు చేయాలి.

–షేక్ అబ్దుల్‌రజాక్, పాత గుంటూరు

గ్రూప్ ఆర్పీ, డమ్మీపై ఫిర్యాదు

ఐపీడీ కాలనీలో ఉన్న ఓ గ్రూప్‌లో పది మంది సభ్యులున్నారు. గ్రూప్ ఆర్పీ, డమ్మీ ఆర్పీ ఏకమై, వ్యక్తి గత రుణాలు కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయలు మంజూరైనట్లు గతంలో తెలిపారు. దీంతో బ్యాంక్ వద్దకెళ్లగా, సభ్యులకు రూ.30 వేలు ఇచ్చి, మిగతా రూ.70 వేలు వారు తీసేసుకున్నారు. మాకు ఇచ్చిన రూ.30 వేలలో రూ.2 వేలు చొప్పున కమీషన్ తీసుకున్నారు. రూ.2 వేలు బ్యాంక్ ఖాతాలో ఉండగా, రూ.26 వేలు చొప్పున సభ్యులం తీసుకున్నాం. రూ.26 వేలకు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నాం. అయితే మిగతా రూ.70 వేలు కూడా చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. మొదట్లో లక్ష రూపాయలకు రూ.40 వేలు కమీషన్ అడగ్గా, అందుకు నిరాకరించాం. దీంతో సభ్యులు అందరూ రూ.30 వేలు రుణాలు తీసుకున్నాం. న్యాయం చేయగలరు.

– షేక్ ఆషాబీ, షేక్ బషీరా, షాహీనా, సయ్యద్‌షా, షేక్ అఖలా, వెంకటరమణ , గ్రూప్ సభ్యులు

సర్పంచులకు నిధులు ఇప్పించాలి

సర్పంచులకు నిధులు ఇప్పించాలని కోరుతూ గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల శివశంకర్ తదితరులు స్పందనలో వినతపత్రం సమర్పించారు.

వీధి కుక్కల బారి నుంచి ప్రజల్ని రక్షించాలి



గుంటూరు వెస్ట్: వీధి కుక్కలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని పటిష్ఠ విధానాలతో అరికట్టాలని వెటర్నరీ శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి జునోటిక్ వ్యాధులపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో వీధి కుక్కల నివారణ కొన్ని ఏజన్సీస్‌ల ద్వారా జరిగేదని తెలిపారు. ఇప్పుడు అవి ముందుకు రావడంలేదని, జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయం చూడాలని ఆయన కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ వీధి కుక్కల్ని నగరాలకు దూరంగా వదిలేయడంతో పాటు వాటి సంతానాన్ని నిరోధించేందుకు కొత్త కమిటీల్ని నియమిస్తున్నామని వెల్లడించారు. జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు మాట్లాడుతూ అర్ధరాత్రి, తెల్లవారుజాము సమయాల్లో వీధి కుక్కలు వైలెంట్‌గా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటి బెడత తీవ్రంగా ఉందని, వివిధ శాఖలు సమన్వయంతో అరికట్టాలని కోరారు. సమావేశంలో జీఎంసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.కిరణ్ కుమార్, డాక్టర్ రఘు, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రజలు తమ అభిప్రాయాల్ని ఓటీపీ ద్వారా తెలియజేసి, నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో విభాగాధిపతులు, నోడల్ అధికారులతో స్వచ్ఛ సర్వేక్షణ్, జగనన్న సురక్ష, ఓటర్ సర్వే, డోర్ నంబర్స్ కేటాయింపులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్– 2023లో నగరానికి మెరుగైన ర్యాంక్ సాధనకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌ల ద్వారా ఫోన్లకు వచ్చే ఓటీపీలను నగర ప్రజలు సచివాలయ కార్యదర్శులకు తెలియజేయాలని ఆమె కోరారు. సచివాలయ కార్యదర్శులు కూడా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు. జగనన్న సురక్షలో ఇంటింటి సర్వే నూరు శాతం పూర్తి కావాలని తెలిపారు. షెడ్యూల్ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు అందాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బంది పై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు జరిగే ఇంటింటి ఓటర్ సర్వేలో బీఎల్‌ఓలు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కమిషనర్ సూచించారు. ఓటర్లు అదే డోర్ నంబర్‌లో ఉంటున్నారా, ఫోటోలు సరిగా ఉన్నాయా, వయస్సు, జెండర్, పేర్లు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల సర్వేపై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రస్తుతం పలు పాఠశాలల్లో నాడు నేడు పనులు జరుగుతున్నందున ఎక్కడైనా పోలింగ్ బూత్ తొలగించడం, మార్చడం చేస్తే దాన్ని అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. నూతన గెజిట్ మేరకు ప్లానింగ్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో డోర్ నంబర్స్ కేటాయింపు చేస్తున్నారని, టీపీఎస్‌లు దాన్ని నేరుగా పరిశీలించాలని ఆమె చెప్పారు. ఎక్కడైనా సమస్యలు వస్తే ఉన్నతాధికారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రవీంద్ర, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్ని విభాగాధిపతులే పరిష్కరించాలి

జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. తొలుత జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత సిబ్బందితో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. స్పందన అర్జీల అప్ డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 46 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 10, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 7, ఉపా సెల్ విభాగానికి 3 అందాయని కమిషనర్ వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రవీంద్ర, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఏరువ ట్రస్ట్ దాతృత్వం అభినందనీయం


వేదికపై మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ
- హాజరైన ఎంపీలు ఆళ్ల, లావు


స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న సాయిరాం

గుంటూరు రూరల్: విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పెద్దపలకలూరులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఏరువ కోటిరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన నిరుపేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సోమవారం పంపిణీ చేశారు. ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 50 విద్యా సంస్థల నుంచి హాజరైన అన్ని తరగతులకు చెందిన 1600 మంది విద్యార్థులకు రూ.51లక్షల మేర ఉపకార వేతనాలు అందించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏటా ఉపకార వేతనాలు అందిస్తూ తన దాతృత్వాన్ని గొప్పగా చాటుకుంటున్న సాయిరామ్ పేరు ‘సాయం’రామ్‌గా అభివర్ణించారు. స్కాలర్‌షిప్ చెక్కులను ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి మంత్రి అందజేశారు. ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ, ఉపకార వేతనాలతో నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఊతంగా నిలుస్తున్న ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని ప్రశంసించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ట్రస్ట్‌తో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రస్ట్ సూచించే పది మంది ఎంటెక్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం తాను ఉచితంగా విద్యనందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులందరికీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఉచితంగా నోట్ పుస్తకాలు అందించారు. ట్రస్ట్ నిర్వాహకులు ఏరువ సాయిరామ్, జగదీశ్వరి, శ్రీవేణి, శ్రీలలిత, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు పోలూరి వెంకటరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, మల్లీశ్వరి, నూనె గంగాధరరెడ్డి, అనిల్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో పాటిబండ్ల స్కూలు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న యలమంచిలి శివాజీ, విష్ణువర్ధన్, కృష్ణవేణి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ నృత్య పోటీల్లో విజేతలుగా నిలిచిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థినుల్ని పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ అభినందించారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన విద్యార్థినుల అభినందనలో కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడారు. సిటిజన్ వెల్ఫేర్ ఫోరం–ప్రైడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15,16వ తేదీల్లో శ్రీకాళహస్తిలో జరిగిన ×శ్రీకాళహస్తి నటరాజ నాట్యాంజలి× జాతీయ స్థాయి నృత్య పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. రెడ్డి శ్రీకళ, జ్ఞానితి తుమ్మురు శివనంది, గరుడ అవార్డులు, కన్నేపల్లి కావ్యశ్రీ వైభవి, బి. హేమ లక్ష్మీప్రియ శివనంది అవార్డుల్ని గెలుపొందినట్లు చెప్పారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో నాట్యకళకు విశిష్టమైన స్థానముందని పేర్కొన్నారు. సమాజం కళల్ని గౌరవించి, ఆదరించడంతో పాటు ప్రోత్సాహాన్ని అందించాలని ఆయన కోరారు. లలిత కళల్లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా పిల్లల్లో మానసిక ఉల్లాసంతోపాటు సంప్రదాయాలపై గౌరవ భావాలు, మర్యాదల ఇనుమడిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణా, గుంటూరు జిల్లాలు శుభారంభం



గుంటూరు బ్యాట్స్‌మెన్ మహీప్ కుమార్

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సెంట్రల్ జోన్ అంతర జిల్లాల సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో కృష్ణా, గుంటూరు జిల్లాలు శుభారంభం చేశాయి. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు ఏసీఏ క్రికెట్ మైదానాల్లో సోమవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. సీపీ మైదానంలో కృష్ణా, ప్రకాశం జట్లు తలపడ్డాయి. వర్షం కారణంగా మ్యాచ్‌ను 34 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 33.5 ఓవర్లకు 238 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్‌లు సుశామ్‌కీర్త్ 34 బాల్స్‌కు 11ఫోర్లు, రెండు సిక్స్‌లతో 78 పరుగులు చేయగా, వరుణ్‌సాత్విక్ 41, సందీప్ 31 పరుగులు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రకాశం జట్టును కృష్ణా బౌలర్లు 27.2వ ఓవర్ వద్ద 112 పరుగులకు కట్టడి చేసి 126 పరుగుల తేడాతో గెలిచారు. కృష్ణా బౌలర్లు లోహిత్‌మోహన్ నాలుగు, కౌశిక్ మూడు వికెట్లు తీశారు. డీవీఆర్ మైదానంలో గుంటూరు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు నిర్ణీత 40 ఓవర్లకు ఏడు వికెట్లు నష్టపోయి 290 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు మహీప్ కుమార్ 93(93 బాల్స్, ఆరు ఫోర్లు, మూడు సిక్స్‌లు), మనోహర్ 75(62 బాల్స్, ఐదు ఫోర్లు, మూడు సిక్స్‌లు), సిద్ధార్థ 47(20 బాల్స్, ఒక ఫోర్, ఐదు సిక్స్‌లు)లతో రాణించారు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి పశ్చిమగోదావరి జట్టును 32 ఓవర్లకు 132 పరుగుల వద్ద ఆలౌట్ చేసిన 158 పరుగుల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించింది.

జీజీహెచ్ ఈఎన్‌టీలో విభాగంలో మైక్రో స్కోప్ ప్రారంభం


మైక్రో స్కోప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, పక్కన ఈఎన్‌టీ వైద్యులు

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జీజీహెచ్ ఈఎన్‌టీ వైద్య విభాగానికి రూ. 20 లక్షల విలువ చేసే మైక్రో స్కోప్ పరికరం అందచేశారని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఈఎన్‌టీలో నూతనంగా ఏర్పాటు చేసిన మైక్రో స్కోప్ పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రత్యేక చొరవతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మైక్రో స్కోప్ మిషన్‌ను ఆసుపత్రికి మంజూరు చేయించారని తెలిపారు. చెవి ఆపరేషన్లలో ఈ మిషన్ ఎంతో ఉపయోగ పడుతోందని పేర్కొన్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లతో పాటు వివిధ రకాలు చేయవచ్చని వివరించారు. రాష్ట్రంలో ఇలాంటి వైద్య పరికరం రెండు, మూడు ఆసుపత్రుల్లో మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. వైద్య పరికరాన్ని జీజీహెచ్‌కు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఈఎన్‌టీ విభాగం లో రెండు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని, మూడో థియేటర్‌లో కూడా పరీక్షలు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ వి.సుధీర్ బాబు, ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ టి.స్వరూప్‌కాంత్, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆసుపత్రికి కూలర్ బహూకరణ

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం క్యాజువాల్టీ విభాగం ప్రవేశ ద్వారం వద్ద పట్టపు బసవ పున్నయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వస్తున్న రోగుల కోసం రూ. 50 వేల విలువ గల కూలర్‌ను ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో కూలర్ బహూకరించిన బసవ పున్నయ్య తనయుడు పట్టపు గోపి, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

భోజనం పరిశీలన

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సోమవారం రాత్రి రోగులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. నాణ్యత గురించి రోగుల్ని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కారంచేడు దళితులకు నివాళి


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు


దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో కారంచేడు మృతులకు నివాళి

నెహ్రూనగర్: భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం ఆధ్వర్యంలో కారంచేడు ఘటనలో మృతి చెందిన దళితులకు ఘన నివాళులర్పించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం మృత వీరులకు జోహార్లు తెలియజేశారు. ఈ సందర్భంగా బహుజన మహాసభ అధ్యక్షుడు బి.ఆర్. భగత్‌సింగ్ మాట్లాడుతూ 38 సంవత్సరాల కిందట అగ్రవర్ణాలు అత్యంత పాశవికంగా మాదిగ పల్లెకు చెందిన దళిత యువకుల్ని హత్య చేయడం ఎంతో బాధాకరమని ఖండించారు. అగ్రవర్ణాలు ఒక్కసారిగా ఊరుపై దాడి చేసిన క్రమంలో దుద్దు వందనం, ఐలే సుమతో పాటు అనేక మంది బరిసెలకు ఎదురొడ్డి పోరాడి అమరవీరులయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జూపూడి శ్రీనివాసరావు, చిన్నం డేవిడ్ విలియమ్స్, బండ్లమూడి స్టాలిన్‌బాబు, కనకవల్లి వినయ్, ఉగ్గం సాంబశివరావు, జొన్నలగడ్డ శ్రీకాంత్, బ్రహ్మయ్య, తిప్పాబత్తిన గోవింద్, పీకేఎస్ పోతురాజు పాల్గొన్నారు.

దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో....

1985లో కారంచేడు దళితుల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక న్యాయ శక్తిగా మారి నూతన చట్టాలతో పాటు రాజ్యాంగ హక్కులు పొందగలిగామని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యకుడు కొరివి వినయకుమార్ తెలిపారు. 38వ కారంచేడు దళిత అమరవీరుల సంస్మరణ సభ సోమవారం గుంటూరు డీబీఫ్ కార్యాలయంలో నిర్వహించారు. దళిత బహుజన సంఘాల నేతలు నివాళులు అర్పించగా, న్యాయవాది పొందుగల ప్రకాశ్ సభకు అధ్యక్షత వహించారు. అంబేద్కర్ భావజాల స్ఫూర్తి, రాజకీయ సాధికారతతో దళిత లిబరేషన్ ఉద్యమాలు గ్రామ గ్రామాన కొనసాగించాలని కొరివి వినయ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీబీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు, బీసీ మహాజన సభ అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, భీంసేన రాష్ట్ర నాయకులు భూషణం, దళిత బహుజన ఉద్యమ నేతలు భూపతి సునీల్ కుమార్, కోడిరెక్క కోటిరత్నం, కాసా ఏసుపాదం, గద్దం పాల్ విజయ్ కుమార్, సంకూరి రాజారావు, లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు చంద్ర నాయక్, వేముల విజయ కుమార్, వాల్మీకి శ్రీనివాస రావు, షేక్ నాగూర్ బాబు, అందుగల కుమార్, మార్పుడి సూరి బాబు, ఉన్నం సుధాకర్ పాల్గొన్నారు.

ఓరుగంటికి వైద్యరత్న పురస్కారం


పురస్కారం అందుకుంటున్న వెంకటరమణ

నగరంపాలెం: సర్వేజన సుఖినో భవంతు (సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ) ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యరత్న పురస్కారాన్ని (2023) అందుకున్నట్లు హోమియో వైద్యులు ఓరుగంటి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయం మెయిన్ హాలులో ఈనెల 16 సాయంత్రం జరిగిన విశిష్ట ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవంలో పురస్కారాన్ని అతిథుల చేతుల మీదగా అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.